తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
2 నవంబర్ 2025
Follow :



# జన చైతన్య లేఔట్‌లో నాలాల ఆక్రమణ



- బఫర్ జోన్‌లోనే భారీ అక్రమ నిర్మాణాలు
- నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు
- కఠిన చర్యలు తీసుకుంటాం
- కమిషనర్ ప్రదీప్ కుమార్

**మణికొండ, నవంబర్1(జనం సాక్షి) :**
గండిపేట మండలం పరిధిలోని మణికొండ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాల దందా రోజురోజుకీ పెరుగుతోంది. ముఖ్యంగా జన చైతన్య లేఔట్‌లో నాలాలు, చెరువులు, పార్క్ స్థలాలపై యథేచ్ఛగా భవనాలు కట్టడం, స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. సహజ నీటి ప్రవాహాన్ని నిరోధిస్తూ ఎల్లమ్మ చెరువును మట్టితో పూడ్చి భవనాలకు మార్గం సుగమం చేస్తున్నారు. చెరువు పక్కనే ఉన్న నాలా బఫర్ జోన్‌లో భారీ సెల్లార్లతో భవనాలు నిర్మించడం, పర్యావరణానికి ప్రజల భద్రతకు ముప్పుగా మారింది. స్థానికులు చెబుతున్న ప్రకారం, గతంలో చెరువు చుట్టుపక్కల నీటి ప్రవాహం సాఫీగా సాగేది. అయితే, ఇటీవల బిల్డర్లు అధికారుల అండతో నిబంధనలను తుంగలో తొక్కుతూ నాలాలను పూడ్చి, రోడ్లు, ప్లాట్లు, సెల్లార్లు నిర్మిస్తున్నారు. దీంతో వర్షాకాలంలో నీటి నిల్వలు, వరద ముప్పులు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ వ్యవహారంపై స్పందించిన మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ “నాలా, చెరువుల ఆక్రమణపై ఇప్పటికే ఫిర్యాదులు అందాయి. తక్షణమే విచారణ ప్రారంభిస్తాం. బఫర్ జోన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను వెంటనే ఆపివేయిస్తాం. ఇప్పటివరకు ఇచ్చిన అనుమతులను పునఃపరిశీలిస్తాం. ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా, వారి బిల్డింగ్ పర్మిషన్లు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం,” అని హెచ్చరించారు. “నాలాలు సహజ నీటి ప్రవాహానికి కీలకం. వాటిని పూడ్చడం చట్టవిరుద్ధం. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సమన్వయంతో అన్ని ఆక్రమణలను గుర్తించి తొలగించే చర్యలు తీసుకుంటాం. ఇకపై ఇలాంటి నిర్మాణాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వం,” అని స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధంగా ఏర్పాటైన లేఔట్‌లో ఈ స్థాయిలో అక్రమాలు జరగడం స్థానిక ప్రజల్లో ఆందోళన, ఆగ్రహం రేకెత్తిస్తోంది. అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.





# అక్రమ నిర్మాణాన్ని కూల్చివేత





**అమీన్పూర్ నవంబర్ 01, (జనం సాక్షి) :**
సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం మియాపూర్ సరిహద్దుల్లో నకిలీ పత్రాలు తో అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని హైడ్రాధికారులు శనివారం కూల్చి వేతలు ప్రారంభించారు. 2022లో నకిలీ పత్రాలను సృష్టించి అమీన్పూర్ మున్సిపల్ నుంచి సర్వేనెంబర్ 337, 338లో నకిలీ పత్రాలను చూపించి మియాపూర్ సర్వే నంబర్ 100, 101 లలో ఉన్న 800 గజాలకు నిర్మాణ తీసుకున్నారు. ఆ స్థలంలో ఐదంతస్తుల భవనం నిర్మాణం చేశారు. అధికారులు గుర్తించి విచారణ చేయడంతో నకిలీ పత్రాలతో అనుమతులు పొందినట్లు గుర్తించారు. ఆ అనుమతులను రద్దు చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై అధికారులు కేసు నమోదు చేశారు. అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేసేందుకు హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. శనివారం మధ్యాహ్నం నుంచి కూల్చివేతలను చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని అధికారులు హెచ్చరించారు.

## గంజాయి పట్టివేత

**ఉప్పల్ నవంబర్ 01 (జనంసాక్షి):** గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్టయ్యారు. ఆబ్కారీ శాఖ ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం. ఉప్పల్లోని విజయపురికాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్టుగా పక్కా సమాచారం అందింది. దీంతో ఎస్టీఎఫ్ బీటీం రంగంలోకి దిగి దాడులు నిర్వహించి రవితేజ, జగదీశ్వర్, దిలీప్, చరణ్ లను అరెస్టు చేశారు. వీరి నుంచి 325 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

## ఘనంగా మెదక్ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు



**మల్కాజిగిరి,నవంబర్ 1 (జనంసాక్షి):** మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పుట్టినరోజు వేడుకలు ఆ పార్టీ నేతలు ఘనంగా జరిపారు. కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, చంద్రశేఖర్, గుండా నిరంజన్ పిట్టల శ్రీనివాస్, జీఎన్వి సతీష్ కుమార్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, సంతోష్ రాందాస్ ముదిరాజ్, పిట్టల నాగరాజు, రామచందర్, సయ్యద్ మబ్బు, ఫరీద్, ఇందిరా ప్రియదర్శిని, ఆశ, శారద, ఆగమయ్య, కొండగౌడ్, ఆగమయ్య, బ్రహ్మయ్య, పీవీ సత్యనారాయణ కీర్తి గణేష్, బాలాజీ పాల్గొన్నారు.

## తుమ్మలూరులో అభివృద్ధి పనులను పరిశీలించిన... ఒడిసా ప్రజా ప్రతినిధులు

- గ్రామ పంచాయతీ రికార్డులను తెలుసుకున్న ప్రజా ప్రతినిధులు

**మహేశ్వరం, నవంబర్ 1 (జనంసాక్షి):** మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో శనివారం ఒడిసా రాష్ట్రానికి చెందిన జాజ్ పూర్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ నళిని ప్రభంజన్, జగత్ సింగ్ పూర్ ఎంపీవో సూర్య ప్రకాష్ తో పాటు ఆరు జిల్లాలకు చెందిన 40 మంది ప్రజా ప్రతినిధులు అధికారులు పర్యటించారు.నాలుగు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా రెండవ రోజు తుమ్మలూరు గ్రామ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు.కేంద్ర, రాష్ట్ర, గ్రామ పంచాయతీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను చూశారు.గ్రామ పంచాయతీ ఆదాయ వ్యయాల రికార్డు,నిర్వహణ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.అనంతరం పల్లె ప్రకృతి వనం,నర్సరీ, వైకుంఠధామం,పాఠశాలను సందర్శించారు.ఒడిసా ప్రజా ప్రతినిధులకు మహేశ్వరం ఎంపీడీవో శైలజారెడ్డి,ఎంపీవో రవీందర్ రెడ్డి అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సీనియర్ నాలెడ్జ్ మేనేజర్ ఆశిష్, అనిల్,పంచాయతీ కార్యదర్శులు జావీద్,అలివేలు, శివ,పరమేష్ , ఒడిసా ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.






జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సామాన్య కార్యకర్త లాగ భోజనం చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

# క్రీడలు శరీర దారుణ్యానికి ఎంతో దోహదం

- ఎన్టీఆర్ విద్యాసంస్థల చైర్మన్ నారా భువనేశ్వరి
- ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో ప్రారంభమైన క్రీడోత్సవాలు




**మొయినాబాద్ నవంబర్ 01 (జనంసాక్షి):** క్రీడలు శరీర దారుణ్యానికి ఎంతో దోహదపడతాయని ఎన్టీఆర్ విద్యాసంస్థల చైర్మన్ నారా భువనేశ్వరి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హయత్ నగర్ సమీపంలో గల ఎన్టీఆర్ విద్య సంస్థల్లో నిర్వహిస్తున్న మూడు రోజుల క్రీడోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ నారా భువనేశ్వరి, సీఈవో రాజేంద్ర కుమార్, సిఓఓ గోపిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కాగడతో క్రీడలను ప్రారంభించారు. సందర్భంగా బెలూన్లను గాలిలోకి వదిలి విద్యార్థులతో వివిధ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ... విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఈ క్రీడలు ఎంతో చేస్తాయని తెలిపారు. ఎన్టీఆర్ విద్యాసంస్థల నిర్వహిస్తున్న క్రీడో త్సవాలు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే విధంగా ఈ ఆటల పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఆమె సూచించారు. క్రీడలు ఆడడం వలన శరీర దారుణ్యానికి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. విద్యతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులు పాల్గొన్నప్పుడే విజ్ఞానం పెంపొందు తుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఒక స్థాయిలో ఎదగడం ఎంత గర్వకారణంగా ఉందని ఆమె తెలిపారు. చదివిన కొంతమంది విద్యార్థులు విదేశాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడి ఉండడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ విద్య సంస్థలో చదివిన ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులను ఆమె పూలమాల శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ క్రీడోత్సవాలను పాల్గొన్న ఆయా పాఠశాలల విద్యార్థులందరూ విజయవంతం చేయాలని సూచించారు. మూడు రోజులపాటు జరిగే క్రీడోత్సవాలో ఆయా పాఠశాలల నుంచి 3,000 మంది విద్యార్థులు పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులందరికీ సౌకర్యాలు కల్పిం చడం జరిగిందని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్టీఆర్ విద్యాస ంస్థల అధ్యాపకులు సిబ్బంది చూసుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం క్రీడోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఇందులో పాల్గొన్న వారందరిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీ ఆర్ ట్రస్ట్ సీఈఓ రాజేంద్ర కుమార్, సిఓఓ గోపి, ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు ,ప్రిన్సిపల్ ఎస్.జె.రెడ్డి డైరెక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ నర్సిం లు,ఏవో సురేష్, అధ్యాపకులు వివిధ కళాశాలల చైర్మన్లు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా రవాణా సౌకర్యం కోసం రూ. 4 కోట్ల నిధుల ప్రతిపాదన

కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**హయత్ నగర్, నవంబర్ 01 (జనంసాక్షి):** మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధిలోని బొమ్మలగూడి నుండి డబుల్ బెడ్ రూం, కుంట్లూరు, తట్టి అన్నారం, నాగోల్ వైపు వెళ్లే ప్రధాన రహదారి అనేక సంవత్సరాల క్రితం నిర్మించబడింది. కాలక్రమేణా ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెంది, దాదాపు 40 కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. బొమ్మల గుడి వద్ద నుండి డబల్ బెడ్ రూమ్ వరకు పాత రోడ్డు ప్రస్తుతం గుంతల మయంతో, రోడ్డంతా పాడవడంతో ఈ కాలనీల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ ను కలసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన అధికారుల ఆదేశాల మేరకు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఈ ఈ రమేష్ బాబు, డి ఈ కనకయ్య, వర్క్ ఇన్స్పెక్టర్ సీతారాం, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, అధికారులు కలిసి పాదయాత్రగా రహదారి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బొమ్మల గుడి నుండి నాగోల్ కు వెళ్లే రహదారి పునర్నిర్మాణానికి దాదాపు 4 కోట్ల నిధుల ప్రతిపాదనను జిహెచ్ఎంసి వద్ద సమర్పించామని వారు తెలిపారు. ఈ రోడ్డు పూర్తి అయిన తర్వాత 40 కాలనీల ప్రజలు సులభంగా ప్రజా రవాణా సదుపాయాన్ని పొందగలరు అని వారు అన్నారు. రాబోయే రోజులలో ఈ రహదారి విస్తరణ, సుందరీకరణ పనులు ప్రారంభమవుతాయాని, నగర శివారులో ఉన్న ఈ ప్రాంత కాలనీలో అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తానని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు కళ్ళెం రవీందర్ రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, కాలనీ వాసులు, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 48 కేజీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో వెండి పతకం సాధించిన వాసవి కళాశాల విద్యార్థిని జే రితిక

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 1 (జనంసాక్షి):** ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం 69వ రంగారెడ్డి జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ అండర్ 17 విభాగంలో జరిగిన పోటీల్లో ఇబ్రహీంపట్నంకు చెందిన వాసవి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న జె.రితిక అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్ 48 కేజీల కేటగిరీలో బాలికల విభాగంలో వెండి పతకం సాధిం చినది.ఈ సందర్భంగా వాసవి విద్యాసంస్థల చైర్మన్ మాదారం రమేష్ మాట్లా డుతూ... భావిష్యత్తులో తమ కళాశాల విద్యార్థులు క్రీడారంగంలో రానిస్తూ, చదువుతో పాటు మంచి గుర్తుంపు తెచ్చుకోవాలని సూచించారు.అనంతరం వాసవి విద్య సంస్థల చెర్మన్ మదారం రమేష్,శేఖర్ గౌడ్లు క్రీడాకారులను, పీ.ఇ.టి రహమత్‌లను ఘనంగా సంపాదించి అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం సుధాకర్,సురేష్ ప్రశాంత్, పాల్గొన్నారు.




## దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన ర్యాలీకి తరలిన ఎమ్మార్పీఎస్ శ్రేణులు



**తలకొండపల్లి నవంబర్ 01 (జనంసాక్షి) :** సుప్రీంకోర్టు సిజెఐ బి.ఆర్ గవాయి,పై దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ..ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో హైదరాబాదులో నవంబర్ 1,న చేపట్టే దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన ర్యాలీకి తలకొండపల్లి మండలం నుంచి ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ,మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు తుడుం శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భారీగా తరలి వెళ్లారు.ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ,ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు,తదితరులు ఉన్నారు.

# స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో అభివృద్ధి పనులు

- మోత్కుపల్లి సీనియర్ యూత్ నాయకుడు ఫిరంగి భాస్కర్
- మోత్కుపల్లి నుంచి రెడ్డిపల్లి వరకు రోడ్డుపై స్వచ్ఛందంగా గుంతల పూడ్చివేత



**మొయినాబాద్ నవంబర్ 01 (జనంసాక్షి):** గ్రామాల అనుసంధానముగా రహదారులు బాగున్నప్పుడే రాకపోకలు సాగుతాయని మోత్కుపల్లి సీనియర్ నాయకుడు ఫిరంగి భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ యూత్ నాయకుడు స్వచ్ఛందంగా మోత్కుపల్లి నుంచి రెడ్డిపల్లి వరకు వెళ్లే రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడడంతో సొంత డబ్బులతో సిమెంట్ కాంక్రీట్ మిల్లర్ తో గ్రామస్తుల తో కలిసి గుద్దలు పూడ్చే పనిని ప్రారంభించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు మోత్పల్లి గ్రామం నుంచి రెడ్డిపల్లి గ్రామానికి వెళ్లాలంటే గుంతల రోడ్డుపై వాహనదారులు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు ఈ సందర్భంగా రోడ్డుపై పడిన గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని సొంత డబ్బులతో స్వచ్ఛందంగా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు గుంతలు పూరచడంతో రోడ్డు ఎంతో బాగుపడి ప్రజలకు ప్రయాణం చేసేందుకు బాగుంటు ందని తెలిపారు రోడ్లు బాగుంటేనే గ్రామాలకు అనుసంధానంగా బంధువులు స్నేహితులు రాకపోకలు నిర్వహిస్తారని తెలిపారు రోడ్ల అనుసంధానం తో సత్సంబంధాలు గ్రామాలకు పెరుగుతాయని పేర్కొన్నారు ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా తన వంతు సహాయంగా మోత్కుపల్లి గ్రామం నుంచి రెడ్డిపల్లి రహదారిని అభివృద్ధిలో భాగంగా గుంతల పూజ కార్యక్రమాన్ని నిర్వహించాలని భాస్కర్ పేర్కొన్నారు కార్యక్రమంలో గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

# యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ అందజేత




**బొంరాస్ పేట/ దుద్యాల నవంబర్ 1 (జనంసాక్షి):** దుద్యాల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ మెయిన్స్ కమ్ స్కాలర్షిప్ పరీక్షలకు సన్నద్ధం కావడానికి యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఉచితంగా అందజేసిన స్టడీ మెటీరియల్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో విజయ రామారావు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్ తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు యూత్ ఫర్ సేవా వారు అందిస్తున్న సహాయ సహకారాలను కొనియాడారు. విద్యార్థులందరూ యూత్ ఫర్ సేవా వారు అందించిన స్టడీ మెటీరియల్ ఉపయోగించుకొని స్కాలర్షిప్ ను దక్కించుకునే విధంగా కష్టపడాలనీ, ఈ మెటీరియల్ జాతీయస్థాయిలో నిర్వహించే ఇతరత్రా పరీక్షలకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని వారు విద్యార్థులకు సూచించారు. గత సంవత్సరం యూత్ ఫర్ సేవా వారు అందించిన స్టడీ మెటీరియల్ ను ఉపయోగించుకొని ఈ ప్రాంతంలో ఉన్న జడ్పీహెచ్ఎస్ దౌల్తాబాద్ నుండి ఇద్దరు, చౌదర్పల్లి నుండి నలుగురు, బొంరాస్ పేట నుండి ఐదుగురు, హకింపేట నుండి ఒకరు మరియు దుద్యాల నుండి ఒకరు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అదేవిధంగా హకీంపేట్, హస్నాబాద్, కుదురుమళ్ళ ఉన్నత పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు కూడా స్టడీ మెటీరియల్ ను యూత్ ఫర్ సేవా వారు అందజేశారని తెలిపారు. 2011వ సంవత్సరం నుండి ఈ ప్రాంతంలో యూత్ ఫర్ సేవా వారు అందిస్తున్న సేవలను కొనియాడుతూ, వీటన్నింటికీ సహకారం అందిస్తున్న యూత్ ఫర్ సేవా సభ్యులు పుండరీకాక్ష, సుష్మిత వారి సహచర బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గొల్ల కురుమల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- రాజ్యాలు పాలించిన చరిత్ర యాదవులది
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు నవంబర్ 1(జనంసాక్షి):** గొల్ల కురుమల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం తాండూర్ పట్టణంలోని బైపాస్ రోడ్ సమీపంలో శ్రీ బీరప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవం మరియు రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించే కుర్వ భవన్ కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మరియు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అందరివాడు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు. పదేళ్లలో జరగని అభివృద్ధి ఏడాదిన్నర కాలంలో చేసి చూపించారని తెలిపారు. ఇప్పుడు, ఎప్పుడు మనందరం ఎమ్మెల్యేకి అండగా ఉండాలన్నారు. బి.సి రిజర్వేషన్స్ కోసం అందరం కలిసి పనిచేద్దామని పిలుపు నిచ్చారు. వెనుకబడిన మన గొల్ల కుర్వలు విద్య, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించాలన్నారు. ఓ కుర్వ బిడ్డగా నా ఊరు సర్పంచ్ గా అవకాశం కల్పిస్తే, ఈ రోజు ప్రభుత్వ విప్ గా మీ ముందున్నా. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ అందరికి సమయాన్ని బట్టి ఇచ్చిన మాట నెరవేరుస్తామన్నారు. గొల్ల కురువలంటే కేవలం పశుపాలకులుగా మాత్రమే కాకుండా, భారతదేశ చరిత్రలో ప్రసిద్ధిగాంచిన విజయనగర సామ్రాజ్య నిర్మాతలైన హరిహర బుక్కరాయుల వంశస్థులు రాజ్యాలు పాలించిన చరిత్ర యాదవులదన్నారు. శివుని చేతిలో ఉండే ఢమరుకం, మన యాదవ సోదరులు వాహించే ఒగ్గు డోలుకు ప్రతిక డోలు నుంచే ఢమరుకం పుట్టుకొంచిందన్నారు. కుర్వలకు మోసం చేయడం, అబద్దాలు చెప్పడం రాదు పాడి పరిశ్రమను నమ్ముకొని జీవనం సాగించే గుణం కలవారు. ధర్మం, న్యాయం ఎటువైపు ఉంటే అటు వైపు నిలబడే జాతి మన గొల్ల కుర్వ జాతిదన్నారు. శ్రీకృష్ణ భగవన్ కూడ కురుక్షేత్రంలో ధర్మం, న్యాయం ఉన్న పాండవులు వైపు నిలబడి గెలిపించాడని గుర్తుచేశారు. అదే మాదిరిగా గత ఎన్నికల్లో మీరందరూ శ్రీకృష్ణుడి వలే ధర్మం వైపు నిలబడ్డారు. కాబట్టే, ఈ రోజు రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తుంది. ఇక్కడ మీ ఆశీస్సులతో నేను ఎమ్మెల్యేగా మీకు సేవ చేసే అవకాశం వచ్చిందన్నారు. మొదటగా పాల నుంచి పెరుగు, పెరుగు నుండి వెన్న, వెన్న నుండి నెయ్యి తీసే పక్రియను కనుగొన్నది గొల్ల కుర్వ సోదరులే అన్నారు. గొల్ల కుర్వ (యాదవ్) లు హైదరాబాద్ లో చేసే సదర్ పండుగ దేశనికీ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, కుర్వ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గే మల్లేశం , గొల్ల, కురువ సంఘం నాయకులు, గొల్ల, కురువ సోదరసోదరీమణులు ఉన్నారు.

# గాజులరామారం ఎస్‌పిఆర్ స్కూల్లో ఘనంగా కర్ర సాము సదస్సు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న సొంటి రెడ్డి పున్నారెడ్డి



**కుత్బుల్లాపూర్ నవంబర్ 1 (జనంసాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజుల రామారం డివిజన్ పరిధిలోని ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్ లో భూమ్స్ అకాడమీ నిర్వాహకులు రఫీ షేక్ అధ్యక్షతన జాతీయ కర్ర సాము సదస్సు, సెలక్షన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి కొండారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం తో పాటు శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయి అన్నారు. మన ప్రాచీన క్రీడైన కర్ర సాము తిరిగి ప్రాచుర్యంలోకి రావడం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పిఆర్ గ్లోబల్ స్కూల్ వైస్ చైర్మన్ చైతన్య పున్నారెడ్డి, భూమ్స్ అకాడమీ నిర్వాహకులు కృష్ణ, క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై కన్నెర్ర చేసిన దుండిగల్ రెవెన్యూ



**నిజాంపేట్ నవంబర్ 1 (జనంసాక్షి):** కుతుబుల్లాపూర్ నియోజకవర్గ దుండిగల్ రెవెన్యూ మండల తాసిల్దార్ నేతృత్వంలో అధికారులు సిబ్బంది శనివారం దుండిగల్ మండలం డి.పోచంపల్లి పరిధిలోని 120 సర్వే నెంబర్ లో ఇటీవల అక్రమ నిర్మాణాలు చేపట్టిన వాటిని కూల్చివేతలు చేపట్టారు. అదే ప్రాంతంలోని 120/1 సర్వే నెంబర్ లో ఇటీవల పుట్టగొడుగులా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వాటిపై ఉదాసీనతో వ్యవహరించడం ఎందుకోనని ప్రజలు ఆరోపణలు వెల్లువిరుస్తున్నాయి. ఇటీవల హైడ్రా బృందం సైతం ఆ ప్రాంతంలో పర్యటించిన ఇప్పటికీ చర్యలు చేపట్టకపోవడం అధికారుల తీరుకు నిదర్శనం అని ప్రజలు తెలియజేస్తున్నారు ఇప్పటికైనా పై అధికారులు 20 కి పైగా అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాల అని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.



**కాప్రా (జనంసాక్షి):** అభివృద్ధి పనులను నాణ్యత ప్రామాణాలు పాటిస్తూ పనుల కృతజ్ఞతలు పూర్తి చేయాలని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. చర్లపల్లి లోని ఎస్సీ బస్తీలో జరుగుతున్న 280 మీటర్ల సీసీ రోడ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డి.ఈ బాలకృష్ణ, ఏ.ఈ అభిషేక్, ప్రశాంత్, ప్రవీణ్ గౌడ్ స్థానిక నాయకులుడి లక్ష్మయ్య, ఎం.లక్ష్మయ్య, కే.నర్సింహా, కొమ్ము సురేష్, జి.భాను చందర్, జి.గణేష్ గౌడ్, టీ.సురేష్, పి.శ్రీనివాస్ , మంచాల అనిత, కొమ్ము ఇందిర, పందిగారి కిష్టమ్మ పాల్గొన్నారు.

## ఈనెల 4న కొడంగల్
# సివిల్ ఆసుపత్రిలో కంటి పరీక్షలు



**కొడంగల్ నవంబర్ 1 (జనంసాక్షి):** కొడంగల్ ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో ఈనెల 4వ తేదీన శంకర హాస్పటల్ ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్స క్యాంపు నిర్వహిస్తున్నట్లు కొడంగల్ మండల అభివృద్ధి అధికారి ఉషశ్రీ తెలియజేశారు. ఐకెపి ఆఫీసులో మండల సమాఖ్య సమావేశంలో తెలియజేశారు. ఈ క్యాంపులో వివిధ గ్రామాల ప్రజల ప్రజలకు తెలియజేయడానికి గ్రామాల్లో చాటింపు వేయించాలని కోరారు. అంతేకాకుండా మహిళా సంఘాల ద్వారా జనాలకు అవగాహన కల్పించి అధిక సంఖ్యలో కంటి పరీక్షలు చేయించుకోవడానికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా సంఘాలు వివో ఏ లు సహకరించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో అంగడి రాయచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇంచార్జ్ డాక్టర్ బుష్ర ఏపీఎం. గోపాల్ సిసి వివో ఏ పాల్గొన్నారు. ఇట్టి ఫ్రీ క్యాంప్ కంటి శస్త్ర చికిత్స ను కొడంగల్ మండల ప్రజలు వినియోగించుకోవాలని అర్హు లైన పెద్ద ఎత్తున పాల్గొనేటట్లు చూస్తారని సమావేశంలో తెలియజేయడం జరిగింది.


## బ్యాంక్ లింకేజీ లపై డిపియం యాదయ్య తనిఖీ



**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి):** డిపియం యాదయ్య బ్యాంక్ లింకేజీ ల పైన జిల్లేడు చౌదరిగూడ మహిళసమాఖ్య లో తనిఖీ చేశారు. అదేవిదంగా మహిళా గ్రూప్ బ్యాంక్ లింకేజీల పైనా బ్యాంక్ మేనజర్లతో మాట్లాడారు. మండల మహిళ సమాఖ్యలో రికార్డులు తనిఖీ చేశారు. సీసీలతో సమావేశం జరిపి మహిళా గ్రూప్ సభ్యులు ఎలా పనిచేస్తున్నాయి అన్ని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, హరిలాల్. సీసీలు రమేష్. జంగయ్య. శ్రీదేవి. లు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకు వినతి పత్రం అందజేత

**మహేశ్వరం,నవంబర్ 1 (జనంసాక్షి):** మహేశ్వరం మండల కేంద్రంలోని గ్రంథాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు వెళ్ళే ప్రధాన రహదారిపై విద్యుత్ పోల్స్ ప్రమాదకరంగా మారయాన్ని బీజేపీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రావణ్ శనివారం మహేశ్వరం ఎంపీడీవో శైలజా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రావణ్ మాట్లాడుతూ... సెంటర్ లైటింగ్ పోల్స్ ను తొలగించి సైదుకు అమర్చాల న్నారు. రోడ్డు మధ్యలో సెంట్రల్ లైటింగ్ పోల్స్ ఉండటం వల్ల పలుమార్లు ప్రమాదాలు కూడా సంభవించాయన్నారు. ఈ కార్యక్రమంలో మోతే యాదయ్య, పాల్గొన్నారు.



## ఉద్యోగరీత్యా హైదరాబాద్ తాళం వేసి వెళ్లిన ఇంట్లో చోరీ

**బొంరాస్ పేట, నవంబర్ 1 (జనంసాక్షి):** ఇంటికి తాళం వేసి ఉద్యోగరీత్యా హైద రాబాద్ వెళ్లిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన బొంరాస్ పేట మండలం తుంకిమెట్ల గ్రామంలో చోటు చేసుకుం ది. ఎస్సై బాల వెంకట రమణ తెలిపిన వివరాల తుంకిమెట్ల గ్రామానికి చెందిన చాకలి సంగమేశ్వర్ గత నెల 27న ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్ళగా గుర్తుతెలియని వ్యక్తులు తాళం విరగొట్టి 10 తులాల వెండి,రూ.15,000 నగదు ఎత్తుకెళ్లినట్లు శనివారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



# మోమిన్ పేట్ మండలంలో తన మార్క్ పాలన ప్రారంభించిన

## యంగ్ అండ్ డైనమిక్ అధికారి సృజన సాహిత్య

**మోమిన్ పేట నవంబర్ 01 (జనంసాక్షి):** మోమిన్ పేట్ మండలంలో ప్రజా సేవా పునాదులను బలపరిచే దిశగా అడుగులు వేస్తున్న యంగ్, ఎనర్జటిక్ మండల అభివృద్ధి అధికారి సృజన సాహిత్య బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటి తనిఖీ శనివారం ఎన్కతల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్కతల గ్రామపంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. గ్రామ పంచాయతీ రికార్డులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, నర్సరీ అభివృద్ధి పనులు వంటి అంశాలను విస్తృతంగా తనిఖీ చేశారు. సాధారణంగా అధికారులు పర్యటనలు సర్వసాధారణం అయినా, సృజన సాహిత్య తనిఖీ ప్రత్యేకత ఏమిటంటే ప్రతి అంశాన్ని లోతుగా అధ్యయనం చేసి, చిన్న చిన్న సమస్యలనైనా గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవడం. గ్రామ ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కార మార్గాలను సూచించడం ద్వారా ఆమె ప్రజల్లో విశ్వాసాన్ని నింపారు. తనిఖీ సందర్భంగా సృజన సాహిత్య అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇచ్చారుప్రతి ప్రభుత్వ పథకం ప్రజల ముంగిటకు చేరేలా కృషి చేయాలి. పారదర్శకత, సేవా ధోరణి మన పాలన యొక్క పునాది కావాలి" అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ, మొదటి పర్యటనలోనే ఇంత శ్రద్ధ, ఇంత క్రమశిక్షణతో తనిఖీ చేయడం నిజంగా అభినందనీయమైందని,"మా మండలానికి ఇలాంటి చురుకైన అధికారి రావడం అదృష్టం"అని సంతోషం వ్యక్తం



చేశారు. ఈ విధంగా తన పాలన ప్రారంభం నుంచే క్రమశిక్షణ, పారదర్శకత, ప్రజాసేవ అనే మూడు మూల సూత్రాలతో ముందుకు సాగుతున్న సృజన సాహిత్య మోమిన్ పేట్ మండలంలో అభివృద్ధి కొత్త దశకు నాంది పలికినట్లు భావిస్తున్నారు. ప్రజల హృదయాల్లో నిలిచే అధికారి సృజన సాహిత్య ప్రజల కోసం, పారదర్శక పాలన కోసం నిర్ణయం అభినందనీయం. అని గ్రామప్రజలు అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ యాదగిరి పంచాయతీ కార్యదర్శి నర్సింలు కారోబార్ కట్టెల నాగరాజు ఫీల్డ్ అసిస్టెంట్ సోమారపుపోచయ్య అంగన్వాడి టీచర్ ప్రమీల ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# భాదిత కుటుంబనికి మనోహరన్న అండ

- కుక్కల దాడిలో 55 గొర్రె పిల్లలు మృతి
- బాధిత ఒగ్గు సాయప్ప కుటుంబానికి ప్రభుత్వ,విప్,బీర్ల ఐలయ్య. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పరామర్శ

**పెద్దేముల్ నవంబర్ 01(జనంసాక్షి):** కుక్కల దాడిలో 55 గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది బాధిత కుటుంబాన్ని శనివారం ప్రభుత్వ విప్ బీర్లా. ఐలయ్య తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి పరమర్శించి వారికి మనోదైర్యాన్ని కల్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లల సంబంధించి రాష్ట్ర పశు సంవర్థక శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరికి ఫోన్ ద్వార జరిగిన సంఘటన పూర్తి వివరాలు తెలియపర్చడంతో మంత్రి ప్రభుత్వం పరంగా పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సంఘటనకు గల పూర్తి నివేదికను సిద్ధం చేసి సంబందిత అధికారులకు అందించాలని వారు సూచించారు. అనంతరం బాధిత కుటుంబంనికి తక్షణ సహాయంగా ప్రభుత్వ విప్ ఐలయ్య రూ.10,000 మరియు స్థానిక శాసన సభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి . రూ.25000 అందించమని తెలిపారు. త్వరలో కుర్వ సంఘం తరుపున మరో రూ.50,000 ఆర్థిక సహాయం అందించే విధంగా చూస్తామని ప్రభుత్వ విప్ ఐలయ్య హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి. కందనెల్లి గ్రామ సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి శ్రీనివాస్ చారి. ఏ బ్లాక్ అధ్యక్షుడు లంక నర్సింలు. పెద్దేముల్ యూత్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్, పాల్గొన్నారు.



## సిఐటియు జిల్లా మహా సభలను జయప్రదం చేయండి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి




**హయత్ నగర్, నవంబర్ 01 (జనంసాక్షి):** ఈ నెల 10, 11 తేదీలలో కాటేదాన్ లో జరుగు సిఐటియు రంగారెడ్డి జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, కార్మికుల తో కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికైన ప్రతినిధులు అందరూ పాల్గొనాలని తెలియజేస్తున్నాం ఈ మహాసభల్లో రంగారెడ్డి జిల్లా ఉద్యమాన్ని సమీక్షించి భవిష్యత్తు ఉద్యమానికి పోరాట కార్యక్రమాలను రూపొందించుకొని ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయుటకు ఈ మహాసభలను జయప్రదం చేయవలసిందిగా కార్మిక వర్గానికి వారు విజ్ఞప్తి చేశారు. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చుటకు బిజెపి సిద్ధమవుతుందని ఆ విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు అనేక పోరాటాలు నిర్వహిస్తుందని వారు అన్నారు. భవిష్యత్తులో ఈ పోరాటాలలో భాగస్వాములు కావడం కొరకు కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు. కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలనే మార్చేసి లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని, దీని ఫలితంగా కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం జరుగుతుందని, ఈ నష్ట నివారణకు కార్మిక వర్గం సంఘాలకతీతంగా ఐక్యమై పోరాడాలని వారు చెప్పారు. పోరాటాల రూపకల్పనలో భాగంగానే ఈ నెల 10న బహిరంగ సభలో పాల్గొని, ప్రజలు అందరూ జయప్రదం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

## శంషాబాద్‌లో యువకుడు
# ఉరి వేసుకుని ఆత్మ హత్య

**రాజేంద్రనగర్, నవంబర్ 1 (జనంసాక్షి):** శంషాబాద్ పోలీస్ స్టే షన్ పరిధిలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. శంషాబాద్ రూరల్ ఇన్స్పెక్టర్ నరేం దర్ రెడ్డి వివరాల ప్రకారం వనపర్తి జిల్లా పెబ్బేర్ గ్రామానికి చెందిన మహేష్ (28) వ్యాపార వృత్తి నిర్వహించేవాడు. భార్య శ్రీదేవితో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మహేష్ కొంతకాలంగా సావిత్రి అనే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో ఇద్దరి కుటుంబాల మధ్య వివాదం నెలకొంది. గత నెల 31న ఉదయం మహేష్ తన భార్యకు ఫోన్ చేసి రూ.10 వేలు కావాలని అడగగా ఆమె నిరాకరించడంతో గొడవపడి ఫోన్ కట్ చేశాడు. ఆ తర్వాత ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య మరుసటి రోజు తెలుసుకునే సరికి మహేష్ శంషాబాద్ మండలం తొండుపల్లి గ్రామంలోని గ్రాండ్ విల్లా వెంచర్‌లోని చెట్టుకు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# మనిషికి మంచి ప్రొటీను అందించే ఆహారం చేపలు

**మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్**



**శామీర్ పేట్ (జనంసాక్షి):** మనిషికి ఆరోగ్య పరంగా మంచి ప్రోటీన్ అందించే ఆహారం చేపలే అని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం శామీర్ పేట్ పెద్ద చెరువులో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ..వంద శాతం సబ్సీడితో చెరువులలో ఉచిత చేప పిల్లలను వదలడం సంతోషంగా ఉందన్నారు. బెంగాల్లో చేపలను జలపుష్పాలు అంటూ వెజిటేరియన్లు కూడా తింటారని గుర్తు చేశారు. కోట్ల మంది దీనిమీద ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. గతంలో చెరువుల మీద కాంట్రాక్టర్ల పెత్తనం ఉండేదని, మత్స్యకారులకు చెరువుల మీద అధికారం లేకుండా చేశారన్నారు. మత్స్యకారులు కాంట్రాక్టర్ కి బ్రోకర్ కి చేపలు పట్టించే కూలీలుగా మాత్రమే పని చేసేవారని, తెలంగాణ వచ్చిన తర్వాత వీటికి స్వస్తి పలికి సొంత సొసైటీ మెంబర్లు మాత్రమే చేపలు పట్టుకుని అమ్మాలి అని నిబంధన తీసు కొచ్చామని గుర్తు చేశారు. నరేంద్ర మోడీ మత్స్య కారులకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారన్నారు. గుజరాత్ లో ఎవరు ప్రభుత్వంలో ఉండాలి అనేది మత్స్యకారులే నిర్ణయిస్తారని చెప్పారు. ప్రభుత్వ భూములు ఇస్తే మత్స్యకారుల సొసైటీలకు బిల్డింగ్ కట్టించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ హనుమంతరావు, జిల్లా మత్స్య అధికారి సుకీర్తి, జిల్లా మత్స్య పారిశ్రామిక అధ్యక్షుడు మన్నె రాజు, ఉపాధ్యక్షుడు మోహన్ కృష్ణ, డైరెక్టర్ వెంకటేష్, దేవేందర్, రాము, నాయకులు, పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయం చేరుకున్న వాహనాలు



**తాండూరు నవంబర్ 1(జనంసాక్షి):** మున్సిపాలిటీకి సంబంధించిన పలు రకాల వాహనాలు గత రెండు రోజులుగా కార్యాలయానికి చేరుకుంటున్నాయి. గత రెండేళ్లుగా ఎక్కడపడితే అక్కడ వదిలేసినటువంటి ఆటోలు, ట్రాక్టర్లు, వంటి పలు రకాల వాహనాలు శనివారం తాండూరు మున్సిపల్ కొత్త కార్యాలయానికి (11) వాహనాలు చేరుకున్నాయి. గత రెండు సంవత్సరా లుగాఈ వాహనాలు రోడ్ల పైన, మెకానిక్ షెడ్లలో పడి ఉన్నాయి. మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి వాహనాలను రప్పించారు. మరమతుల పేరిటషెడ్ లకు పరిమి తమైనటువంటి వాహనాలన్నింటిని తక్షణమే కార్యాలయానికి తీసుకురావాలని సానిటరీ ఇన్స్పెక్టర్లు, జవాన్లను సీరియస్ గా కమిషనర్ ఆదేశించడంతో ఒక్కొక్క వాహనం కార్యాలయానికి చేరుకుంటు న్నాయి. అదనపు కలెక్టర్ అనుమతితో వాహనాలను మరమ్మతులు చేయిం చడం జరుగుతుందని కమిషనర్ బి. యాదగిరి వెల్లడించారు.

# పార్కుల కబ్జాలపై చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**- సామాజిక కార్యకర్త ఆకుల సతీష్**



**నిజాంపేట్ నవంబరు 1 (జనంసాక్షి):** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం మల్లంపేట్ పరిధిలోని కెవిఆర్ లేఔట్ లో పది పార్కుల స్థలం సుమారు 100 కోట్లు కబ్జా జరిగిన ఇప్పటివరకు ఏ ఒక్కరి పైన కేసు చేయకుండా మున్సిపల్ అధికారులు ఉదాసీనతో వ్యవహరించడం పై అధికారుల తీరుకు నిదర్శనమని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ తెలిపారు. ఈ మేరకు శనివారం దుండిగల్ మున్సిపల్ లో ఫిర్యాదు చేశారు. దుండిగల్ మున్సిపల్ పరిధిలో మల్లంపేట నందు గతంలో కెవిఆర్ లేఔట్ 54 ఎకరాల వెంచర్ 2004 వేయడం జరిగింది. బిఆర్ఎస్ పాలనలో స్థానిక ఎమ్మెల్సీ , తో పాటు ఆయన సోదరుడు అండదండలు సహకారంతో నరేష్ వారు మిత్రులు కలిసి దాదాపు పది పార్కు స్థలాలు కబ్జా చేయడమే కాకుండా దాదాపు 100 కోట్ల విలువైనపార్క్ ఆస్తికి తప్పుడు పత్రాలు సృష్టించి వెంచర్ వేసిన కెవి రామరాజు పేరు మీద సంతకం ఫోర్జరీ చేసి హైకోర్టు నుండి ఉత్తర్వులు పేరుతో పార్కులు రిజిస్ట్రేషన్లు చేయడంపై గతంలోనే తాము ఫిర్యాదు చేసిన నామ మాత్రం కూల్చివేశారు కానీ, దీనిపై మున్సిపల్ అధికారులు కేసును నమోదు చేయలేదు. చివరికి 2024 సూరారంలో అక్రమ గన్ తో నరేష్ కాల్పులు జరపడం తర్వాత పోలీస్ అధికారులు కె.వి రామరాజు ఇచ్చిన పార్క్ స్థలాల కబ్జాపై ఫిర్యాదు ఆధారంగా నరేష్ వారి మిత్రులపై (737/2024) దుండిగల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి ముగించారు. అసలు అండదండలు సాకారం అందించిన ఎమ్మెల్సీ , సోదరుడు కౌన్సిలర్ కృష్ణ పాత్ర పై విచారణ జరపలేదు. చివరికి ప్రస్తుతం కె.వి.ఆర్ లేఔట్ లో అప్పట్లో కూల్చివేసిన పార్క్ స్థలాలు ప్రస్తుతం అధికార పార్టీ నేత తో నరేష్ అనే వ్యక్తి మళ్లీ చేతులు కలిపి మళ్లీ అమ్మకాలు చేయడంపై తక్షణమే కెవిఆర్ లేఔట్ లో పార్కు స్థలాల్లో ఆక్రమించుకున్న అన్ని నిర్మాణాలను కూల్చివేసి, పార్కులను పరిరక్షించడానికి ఫెన్సింగ్ వేసి రక్షించడమే కాకుండా నరేష్ మిత్రులు ఎమ్మెల్సీ తో పాటు తమ్ముడు కృష్ణ పాత్ర పై కూడా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అని మున్సిపల్ అధికారులకి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి , పాండు పాల్గొన్నారు.

# నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సన్మానం



**నిజాంపేట్ నవంబరు 1 (జనంసాక్షి):** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించి సంవత్సరం కాలం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఏఐటీయూసీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు ఆశి. యాదయ్య ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.డీ. షబ్బీర్ అలీ కి సన్మానం నిర్వహించారు. . అనంతరం వారు. మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా షబ్బీర్ అలీ బాధ్యతలు తీసుకున్న తరువాత నిజాంపేట్ మున్సిపల్ కార్మికుల అనేక సమస్యలు పరిస్కారం చేయడం. కార్మికులకు కిట్ లు ఇవ్వడం జరిగింది. అని అన్నారు. అలాగే అనేక పార్కులు అభివృద్ధి చేయడం జరిగిందని . రోడ్లు, డ్రైనేజిలు అభివృద్ధి పనులు వేయడం జరుగుతుందని తెలిపారు. గోపి కమిషనర్ తరువాత అనేక మంది వచ్చిన చేయని పని ఇప్పుడు షబ్బీర్ అలీ చేస్తున్నార ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాలభిందెల శ్రీనివాస్, పొన్నికంటి దస్తగిరి, సురేందర్, ఉపేంద్ర పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇండ్లు







**గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి**

**హైదరాబాద్ నవంబరు 1 (జనంసాక్షి):** మేడ్చల్ నియోజకవర్గంలోని తూముకుంట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిర్మితమైన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ పూజా కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాజు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ ఇళ్లను అందించిందని తెలిపారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా లక్షలాది మంది పేద కుటుంబాలకు లబ్ధి కలిగిందని చెప్పారు. స్థానికులు పలు సమస్యల మీద డిప్యూటీ మేయర్ కు విన్నవించగా.. తక్షణ పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలిచ్చారు. లబ్ధిదారులు మాట్లాడుతూ పేదోడి సొంతిల్లు కల నెరవేర్చినందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అలాగే డిప్యూటీ మేయర్ కి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టాలి

**తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్ వాణి**

**మహేశ్వరం,నవంబర్1(జనంసాక్షి):** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్ వాణి అన్నారు.శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీ,రావిర్యాల, తుక్కుగూడలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మించిన గృహాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ స్వామిక్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మల్లేష్ పాల్గొన్నారు.

